ప్రజాశక్తి
శనివారం 30 మార్చి 2024
5
పార్వతీపురం మన్యం

గుడ్‌ఫ్రైడే సందర్భంగా సీతంపేట పురవీధుల్లో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

-వివరాలు 6లో...

టిడిపిలో వీడిన ఉత్కంఠ

- చీపురుపల్లి అసెంబ్లీ అభ్యర్థిగా కళావెంకటరావు
- విజయనగరం లోక్‌సభకు కలిశెట్టి అప్పలనాయుడు
- కంగుతిన్న నాగార్జున, బంగార్రాజు, మీసాల గీత, చంద్రశేఖర్
- పార్లమెంట్ అధ్యక్ష పదవికి నాగార్జున రాజీనామా
- అధిష్టాన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తెలుగు తమ్ముళ్ల ర్యాలీ, నిరసన
- నెల్లిమర్లలో ఇండిపెండెంట్‌గా పోటీకి బంగార్రాజు సిద్ధం
- అన్ని నియోజకవర్గాల్లోనూ తిరుగుబావుట ఎగురవేస్తున్న నాయకులు

కలిశెట్టి అప్పలనాయుడు

కిమిడి కళావెంకటరావు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

టిడిపిలో ఎంపీ, ఎమ్మెల్యే టిక్కెట్ల వ్యవహారంపై నెలకొన్న ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా కిమిడి కళావెంకటరావును, విజయనగరం లోక్‌సభ అభ్యర్థిగా ఎచ్చెర్ల నియోజకవర్గం రణస్థలానికి చెందిన కలిశెట్టి అప్పలనాయుడును పార్టీ అధిష్టానం శుక్రవారం ప్రకటించింది. దీంతో, విజయనగరం జిల్లాలో టిడిపి టిక్కెట్ల వ్యవహారం కొలిక్కివచ్చినట్టుగా భావించవచ్చు. కళా వెంకటరావు శ్రీకాకుళం జిలాల్ల ఎచ్చెర్ల నియోజకవర్గం సీటును ఆశించారు. అయితే పొత్తులో భాగంగా ఆ సీటును బిజెపికి కేటాయించడంతో ఆయనకు చీపురుపల్లి అసెంబ్లీ లేదా విజయనగరం పార్లమెంట్ సీటు వస్తుందా రాదా అని ఆ పార్టీ కార్యకర్తలు ఉత్కంఠంగా ఎదురు చూశారు. చివరకు చీపురుపల్లి అసెంబ్లీ సీటును అధిష్టానం కేటాయించింది. గతంలో ఆయన ఉణుకూరు, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. విద్యుత్, హోంశాఖ మంత్రిగా పనిచేశారు. కలిశెట్టి అప్పలనాయుడు టిడిపి ఉత్తరాంధ్ర శిక్షణ శిబిరం డైరెక్టర్‌గా పనిచేశారు. ఈయన కూడా తొలి నుంచీ ఎచ్చెర్ల నియోజకవర్గ సీటును ఆశించారు. చివరకు విజయనగరం ఎంపి అభ్యర్థిగా ఆయనకు అవకాశం లభించింది.

టిడిపి అభ్యర్థుల చివరి జాబితా విడుదల కావడంతో ఇప్పటివరకూ ఎంపీ, ఎమ్మెల్యే టిక్కెట్లు ఆశించిన పలువురు నాయకులు భంగపడ్డారు. వీరిలో చీపురుపల్లి, నెల్లిమర్ల నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు కిమిడి నాగార్జున, విజయనగరం మాజీ ఎమ్మెల్యే మీసాల గీత ఉన్నారు. టిక్కెట్ ఇవ్వకపోవడంతో నాగార్జున చీపురుపల్లి అసెంబ్లీ, విజయనగరం పార్లమెంట్ ఇన్‌ఛార్జి పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలో తన కార్యాచరణ ప్రకటించనున్నట్టు కూడా చెప్పారు. మరోవైపు నాగార్జునకు మద్దతు పలుకుతూ 'కళా వద్దు.నాగార్జునే ముద్దు' అంటూ టిడిపి కార్యకర్తలు చీపురుపల్లిలో ర్యాలీ నిర్వహించారు. నాగార్జున క్యాంపు కార్యాలయం ముందు కూడా పార్టీ కరపత్రాలను తగలబెట్టి నిరసన తెలిపారు. దీంతో, ఈ నియోజకవర్గంలో టిడిపిలోని అంతర్గత రాజకీయాలు రసవత్తరంగా మారాయి.

జనసేన పొత్తులో భాగంగా నెల్లిమర్ల నియోకవర్గం సీటు కోల్పోయిన కర్రోతు బంగార్రాజుకు భీమిలి సీటు ఇస్తారంటూ పార్టీలో ప్రచారం చేసిన సంగతి తెలిసిందే. ఐవిఆర్ఎస్ సర్వే కూడా చేపట్టారు. చివరకు ఆ సీటు మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావుకు కేటాయించడంతో కర్రోతు ఆశలు అడియాశలయ్యాయి. ఈనేపథ్యంలో ఆయన ఇండిపెండింట్‌గా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. మాజీ ఎమ్మెల్యే మీసాల గీతపేరును చీపురుపల్లి అసెంబ్లీ, విజయనగరం ఎంపీ అభ్యర్థిత్వానికి కూడా పార్టీ ఐవిఆర్ఎస్ నిర్వహించింది. దీంతో, గీతకు ఈ రెండింటిలో ఏదో ఒక సీటు ఖాయమంటూ చర్చ నడించింది. ఆచరణలో అటువంటిదేమీ లేకపోవడంతో ఆమెతో తన అనుయాయులు ఖంగుతిన్నారు. ఎంపీ అభ్యర్థిగా డెంకాడ ఎంపిపి కంది చంద్రశేఖర్ పేరు కూడా పరిశీలనకు వెళ్లినప్పటికీ చివరి క్షణాల్లో తిరస్కరణకు గురైంది.

ఎస్.కోట నుంచి ఎమ్మెల్యే సీటు ఆశించి నాలుగు రోజుల క్రితమే భంగపడ్డ గొంప కృష్ణ, అధిష్టానంతో జరిగిన చర్చల తరువాత కూడా వెనక్కి తగ్గలేదు. కార్యకర్తలతో త్వరలో సమావేశం ఏర్పాటు చేసి కార్యాచరణ ప్రకటిస్తామంటూ పార్టీకి హెచ్చరించారు. మరోవైపు గజపతినగరంలో సీటు కోల్పోయిన కెఎ నాయుడు, ప్రస్తుత అభ్యర్థి అభ్యర్థి శ్రీనివాసరావుకు సహకరించే పరిస్థితే లేదంటూ తేల్చిచెప్తున్నారు. రాజాంలో మాజీ స్పీకర్ ప్రతిభాభారతితోపాటు ఆయన అనుయాయులు కూడా ఇంకా కోండ్రు మురళితో కలిసి నడవడం లేదు. మురళి కూడా బుజ్జగింపు ప్రయత్నాలు చేయడం లేదు. దీంతో, ఇక్కడి తెలుగు తమ్ముళ్ల వ్యవహారం ఇప్పట్లో తేలేటట్టు కనిపించడం లేదు. విజయనగరం అభ్యర్థి అదితి విజయలక్ష్మితో మాజీ ఎమ్మెల్యే మీసాల గీత కలిసి వెళ్లడం లేదు. ఇలా తొలి నుంచీ టిక్కెట్ కోసం ఎంతో ఆశగా ఎదురుచూసి భంగపడ్డవారంతా అధిష్టానం నిర్ణయాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఎస్.కోట, చీపురుపల్లిలో రాజీనామాలతోపాటు పార్టీపై తిరుగుబావుట ఎగరవేస్తుండగా, మిగిలిన చోట్ల గుంభనంగా ఉన్నారు. పరిణామాలు ఎలా దారితీస్తాయో కొద్దిరోజులు వేచిచూడాల్సిందే.

మన్యంలో భానుడి భగభగలు

- 39 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రత
- వేసవి తాపానికి అల్లాడుతున్న ప్రజలు



ప్రజాశక్తి - కురుపాం

మన్యంలో భానుడు భగభగలాడుతున్నాడు. శుక్రవారం మన్యంలో అత్యధికంగా 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మార్చి నెలాఖరులో వేసవి తాపానికి ప్రజలు అల్లాడుతున్నారు. ఎండను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. మార్చి నెలాఖరులో భగభగలాడుతున్న సూర్యుడు తన ప్రతాపాన్ని పెంచేశాడు. గత వారం రోజుల నుంచి ఎండ తీవ్రరూపం దాల్చింది. పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మన్యం జిల్లాలో గతేడాది ఇదే సమయానికి పగటి పూట అత్యధికంగా 36 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా ఈ ఏడాది 39 డిగ్రీలకు చేరుకుంది. అలాగో నియోజకవర్గం పరిధిలోని గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస 39 డిగ్రీలు నమోదు కాగా, గిరిజన గ్రామాల్లో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అత్యధిక ఉష్ణోగ్రతల వల్ల ఎండ సెగ తీవ్ర స్థాయిలో కనిపించింది. ఎండ ధాటికి తట్టుకోలేక మధ్యాహ్నం పూట రోడ్ల మీద జన సంచారం పలుచబడింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ రోడ్ల మీద జనం చాలా తక్కువగా కనిపించారు. అత్యవసర పనుల విషయంలో మినహాయించి మిగతా సందర్భాల్లో రోడ్ల మీదకు వచ్చేందుకు జనం జంకే పరిస్థితి ఏర్పడింది. నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలో మధ్యాహ్నం పూట నిర్మానుష్యంగా కనిపించాయి.

ఎక్కువ ప్రమాదం ఎవరికంటే

ఎండ సమయం లో బయట ఎక్కువగా తిరగడం వల్ల పిల్లల్లో ఎక్కువగా వడదెబ్బ తగిలే అవకాశం ఉందని వైద్యులు అంటున్నారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, క్రీడాకారులు, బాలింతలపై ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. దీర్ఘకాలిక వ్యాధులు, స్థూలకాయం ఉన్నవారు, మద్యం ఎక్కువగా తీసుకునే వారు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

జాగ్రత్తలు తప్పవంటున్న నిపుణులు

ప్రజలు బయటకు తిరిగే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు, వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వడదెబ్బ వంటివి తగలకుండా నీటిని ఎక్కువగా తీసుకుంటూ సాధ్యమైనంత వరకు నీడలో ఉండాలని సూచిస్తున్నారు. వడదెబ్బ తగిలిన తర్వాత మళ్లీ ఎండలోకి వెళ్లకూడదని, చల్లని నీడలో విశ్రాంతి తీసుకోవాలని అంటున్నారు. బయట తిరిగే సమయంలో తలకు టోపీ పెట్టుకోవాలని, గొడుగు వాడాలని, రోజుకు ఐదు లీటర్లకు తగ్గకుండా నీరు తాగాలని, సమయానికి ఆహారం తీసుకోవాలని, ఉప్పు కలిపిన ద్రావాలు తాగాలని, శరీరంలో నీటి శాతాన్ని పెంచుకునేందుకు పుచ్చకాయ, కొబ్బరి నీళ్లు తాగాలని, వదులైన కాటన్ దుస్తులు. ధరించాలని సూచిస్తున్నారు.

ప్యాకింగ్ చేసిన చింతపండును పరిశీలిస్తున్న జిసిసి డిఎం మహేంద్రకుమార్

గురుకులాలకు జిసిసి చింతపండు

ప్రజాశక్తి - బెలగాం

పార్వతీపురం జిసిసి 2020-21 సంవత్సరంలో కొనుగోలు చేసిన సుమారు 12000 క్వింటాళ్ల చింతపండు పార్వతీపురం డివిజన్ పరిధిలో గల పార్వతీపురం, సాలూరు, గుమ్మలక్ష్మీపురం గురుకులాలతో పాటు పాడేరు, చింతపల్లి, అరకు ముంచింగిపుట్టు, జి.మాడుగుల, కాశీపట్నం రకాలు కూడా టెండర్‌లో పెట్టమని పార్వతీపురం జిసిసి డివిజనల్ మేనేజర్ వి.మహేంద్ర కుమార్ తెలిపారు. ఈ టెండర్ శనివారం ఉదయం 10 గంటల నుండి విశాఖపట్నం జిసిసి ప్రధాన కార్యాలయంలో జరుగుతుందని తెలిపారు ఈ ఏడాది చింతపండు దిగుబడి అంత ఆశాజనకంగా లేదని, గత ఏడాది, ఈ సంవత్సరానికి జిసిసి మొత్తంగా 10వేల క్వింటాళ్లు కొనుగోలు చేసిందని తెలిపారు. కానీ ఈ ఏడాది పంట దిగుబడి లేని కారణంగా కొనుగోలు జరపలేదని తెలిపారు పంట దిగుబడి లేని కారణంగా గిరిజనులు సేకరించిన పంటను ఎంఎస్‌పి ధర కంటే ఎక్కువగా ఎక్కడ వచ్చినా వారికి అమ్ముకునే స్వేచ్ఛ ఉందని తెలిపారు. ఈ టెండరు జిసిసి మేనేజింగ్ డైరెక్టర్ జిసురేష్ కుమార్ ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు.

ఐపిఎల్ స్కోరర్‌గా తోట విజయ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 31న విశాఖలో జరగనున్న ఢిల్లీ క్యాపిటల్, కోల్‌కత్తా మధ్య జరగనున్న ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్‌కు విజయనగరానికి చెందిన తోట విజయ్ స్కోరర్‌గా నియమితులయ్యారు. ఈమేరకు ఆంధ్ర క్రికెట్ సంఘం కార్యదర్శి గోపీనాథ్ రెడ్డి ప్రకటించారు. ఇప్పటికే విజయ్ 12 వన్ డే, 6 టీ20, 3 టెస్ట్, 13 ఐపిల్ మ్యాచ్‌లకు స్కోరర్‌గా బాధ్యతలు నిర్వహించారు. విజయ్ 450 మ్యాచ్ లకు పైగా అంపైర్ గా కూడా వ్యవహరించారు. 2008లో ఆంధ్ర క్రికెట్‌లో అంపైర్ గా, 2009 లో బిసిసిఐ లెవెల్ 1 అంపైర్ గా, 2012, 2018లో బిసిసిఐ నిర్వహించిన స్కోరింగ్ పరీక్షల్లో ఇండియాలోనే మొదటి స్థానం సాధించడం మన రాష్ట్రానికి, జిల్లాకి ఎంతో గర్వకారణమని అన్నారు.

ఒడిశా వక్రబుద్ధి

- ఆంధ్రా అభివృద్ధి పనులకు అడ్డుపుల్ల
- కొటియా గ్రామాల్లో యథేచ్ఛగా ఒడిశా పనులు
- చోద్యం చూస్తున్న మన్యం జిల్లా అధికారులు

ప్రజాశక్తి - సాలూరు

వివాదాస్పద కొటియా గ్రామాల విషయంలో ఒడిశా వక్ర బుద్ధి ప్రదర్శిస్తోంది. 21 గ్రామాలపై పెత్తనం కోసం ఆ రాష్ట్ర ప్రభుత్వం అడ్డదారులు తొక్కుతోంది. కొరాపుట్ జిల్లా అధికారుల అండదండలతో పొట్టంగి సమితి అధికారులు ఎపి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారు. గతంలో ఎపి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో గంజాయి భద్రలో మాజీ సర్పంచ్ గెమ్మెల భీషు నిర్మించిన అంగన్వాడీ కేంద్రాన్ని కూల్చివేశారు. ఎప్పటికప్పుడు సాలూరు మండలానికి చెందిన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది కొటియా గ్రామాల వైపు వెళ్తుండగా ఒడిశా పోలీసులు, అధికారులు అడ్డుకున్న సందర్భాలు చాలా ఉన్నాయి. ప్రధానమంత్రి జన్ ధన్ కార్యక్రమంలో భాగంగా గత కొంతకాలంగా ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో ఇళ్లకు విద్యుత్ మీటర్ల పంపిణీ చేపడుతున్నారు. దీనిలో భాగంగా గంజాయి భద్రలో విద్యుత్ లేని గిరిజనుల ఇళ్లకు విద్యుత్ సిబ్బంది మీటర్లు వేసే పని చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న పొట్టంగి సమితి అధికారులు, కొటియా పోలీసులు అక్కడకు చేరుకుని విద్యుత్ మీటర్లు బిగించకుండా అడ్డుకున్నారు. దీనిపై మాజీ సర్పంచ్ గెమ్మెల భీషు ఆధ్వర్యాన గిరిజనులు ఒడిశా అధికారులను నిలదీశారు. మీటర్ల బిగింపు పనులు జరగకుండా ఒడిశా అధికారులు విద్యుత్ మీటర్లున్న ఆటోను కొటియా పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున మీటర్లు వేయొద్దని పొట్టంగి సమితి అధికారులు స్పష్టంగా చెప్పారు. అనేక ఏళ్లుగా కొటియా గ్రామాల్లో చాలా మంది గిరిజనుల ఇళ్లకు విద్యుత్ సరఫరా లేదు. దీంతో విద్యుత్ మీటర్లను బిగించాలని స్థానికులు కోరడంతో ఆ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

యథేచ్ఛగా ఒడిశా పనులు

కొటియా గ్రామాల్లో కోరాపుట్ జిల్లా అధికారులు యథేచ్ఛగా అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నారు. అంగన్వాడీ కేంద్రాల నిర్మాణం, సిసి రోడ్లు, భవనాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. సారిక పంచాయతీ నేరెళ్లవలసలో జలజీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయి పథకానికి సంబంధించిన పనులు ఒడిశా ప్రభుత్వం చేపట్టింది. ఒడిశా చేసిన ఏ అభివృద్ధి పనులనూ ఎపి అధికారులు అడ్డుకున్న దాఖలాల్లేవు. ఏదో ఒకవిధంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని భావిస్తూ ఎపి అధికారులు ఉదాసీన వైఖరి ప్రదర్శిస్తున్నారు.

కొరాపుట్, మన్యం జిల్లా అధికారుల మధ్య సమన్వయం

రానున్న ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు జిల్లాల అధికారులు కొటియా గ్రామాల వ్యవహారంపై పరస్పర చర్చలు జరిపారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, కొరాపుట్ జిల్లా కలెక్టర్ కీర్తి వాసన్‌తో చర్చించారు. ఎన్నికల నేపథ్యంలో వివాదాస్పద కొటియా గ్రామాల వ్యవహారం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరస్పరం సహకరించుకుందామని అంగీకరించారు. ఈ విషయాన్ని మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మీడియా సమావేశంలో ప్రకటించారు. ఇది జరిగి వారం రోజులు కాకముందే పొట్టంగి సమితి అధికారులు ఎపి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను అడ్డుకున్నారు.

కొటియా పోలీసు స్టేషన్లో ఉన్న విద్యుత్ మీటర్లతో వచ్చిన ఆంధ్రా ఆటో

ఒడిశా అధికారులు పైకి ఒకటి చెపుతూ తెరవెనుక నుంచి కుటిల నీతి అమలు చేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. దీనికి కారణం కొరాపుట్ జిల్లాకు చెందిన కీలక బిజెపి అగ్రనేత దర్శకత్వంలో ఆ జిల్లా అధికారులు పని చేస్తున్నట్టు తెలుస్తోంది.

ఒకేరోజు పోలింగ్‌తో కొటియా గ్రామాలపై ఒత్తిడి

ఒడిశా, ఆంధ్రా రాష్ట్రాలకు ఒకే రోజున రానున్న ఎన్నికల పోలింగ్ జరగనుంది. దీంతో వివాదాస్పద కొటియా గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఒకేరోజు పోలింగ్ కావడంతో ఓటు హక్కు ఎలా వినియోగించుకోవాలని తర్జనభర్జనలు పడుతున్నారు. కొరాపుట్ ఎంపి, పొట్టంగి అసెంబ్లీ స్థానాలకు, అరుకు ఎంపీ, సాలూరు అసెంబ్లీ స్థానాలకు మే నెల 13న పోలింగ్ నిర్వహిస్తారు. రెండు రాష్ట్రాల్లో కొటియా గ్రామాల ప్రజలకు ఓటుహక్కు వుంది. దీంతో వీరంతా నాలుగు ఓట్లు వేసే అవకాశం ఉంటుంది. ఎపి ప్రభుత్వం ఈ గ్రామాలకు సంబంధించి మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఒడిశా ప్రభుత్వం కూడా పట్టు చెన్నారు, కొటియా గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. పోలింగ్ సమయం దగ్గర పడుతున్న కొద్దీ ఒడిశా అధికారులు ఇంకెన్ని జిమ్మిక్కులు చేస్తారో వేచి చూడాల్సిందే మరి.

మైనింగ్ తవ్వకాలను అడ్డుకున్న గిరిజనులు

వివాదాస్పద కొటియా గ్రామాల్లో ఒకటైన ఎగువ శెంబి వద్ద మైనింగ్ తవ్వకాలకు ఒడిశా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు గ్రామం సమీపంలో ఉన్న కత్తుల కొండపై చదును చేసి తవ్వకాలకు సిద్ధమవుతోంది. ఈ కొండలో విలువైన ఖనిజ నిక్షేపాలు ఉన్నట్లు నిర్ధారణ అయింది. దీంతో ఒడిశా మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అధికారులు గుట్టుచప్పుడు కాకుండా తవ్వకాలకు చర్యలు చేపట్టారు. ఎన్నికల కోడ్ అమలు సమయంలో ఒడిశా ప్రభుత్వం సందట్లో సడేమియా అన్నట్లు మైనింగ్ తవ్వకాలకు శ్రీకారం చుట్టింది. ఒకవైపు ఆంధ్రా ఉద్యోగులను కొటియా గ్రామాల్లోకి అడుగు పెట్టకుండా చేస్తున్న ఒడిశా అధికారులు మైనింగ్ తవ్వకాలకు వ్యూహరచన చేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం ఈ కొండ సమీపంలో బోరు తీయడానికి రిగ్ మిషన్ ప్రయత్నించగా స్థానిక గిరిజనులు అడ్డుకున్నారు. దీంతో బోరు తవ్వకాలు నిలిపివేశారు. కొండ చుట్టూ తమ సాగు భూములున్నాయని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ఎగువ శెంబిలో సుమారు 90 గిరిజన కుటుంబాలు వున్నాయి. మైనింగ్ తవ్వకాలు జరిపితే సాగు భూములు నష్టపోవడమే కాకుండా నివాసాలకు ముప్పు ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తవ్వకాలు జరగనీయ బోమని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఎపి ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని మైనింగ్ తవ్వకాలు నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారు.

మైనింగ్ తవ్వకాలను అడ్డుకుంటున్న గిరిజనులు

పలుచోట్ల టిడిపి ఆవిర్భావ దినోత్సవం

సాలూరులో టిడిపి ఆవిర్భావ దినోత్సవాలు నిర్వహిస్తున్న నాయకులు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

42 ఏళ్ల క్రితం తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో రాష్ట్రంలో రాజకీయ చైతన్యం కలిగిందని, ఈ ఘనత నందమూరి తారకరామారావుకు దక్కుతుందని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్ అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులతో కలిసి పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగువారు ఉన్నంతకాలం టిడిపి ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి, కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నియోజకవర్గ కార్యాలయంలో ఆవిర్భావ వేడుకలు

పార్వతీపురం నియోజకవర్గ కార్యాలయంలో టిడిపి ఆవిర్భావ వేడుకలు నియోజకవర్గ పార్టీ అభ్యర్థి బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు, జనసేన సమన్వయకర్త ఆదాడ మోహన్‌రావు, మండల కన్వీనర్ మణి, టిడిపి సీనియర్ నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, బార్నాల సీతారాం, గొరజాన చంద్రమౌళి, బోను చంద్రమౌళి, డాక్టర్ భాను ప్రసాద్, కార్యకర్తలు హాజరయ్యారు.

కురుపాం : తెలుగు ప్రజల ఆత్మగౌరవమే ఎన్టీఆర్ అని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్‌చంద్ర దేవ్ అన్నారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయం వద్ద ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి టి.జగదీశ్వరి ఆధ్వర్యంలో జరిగిన టిడిపి 43వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, అరుకు పార్లమెంట్ బిసి సెల్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, టిఎన్ఎస్ఎఫ్ మీడియా కోఆర్డినేటర్ సుకేష్ చంద్ర పండా, మండల కన్వీనర్లు కెవి కొండయ్య, పాడి సుధా, పల్ల రాంబాబు, శేఖర్ పాత్రుడు, అక్కేన మధు, ఐదు మండలాల టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సాలూరు: తెలుగు రాష్ట్రాల ప్రజల గుండెచప్పుడుగా తెలుగు దేశం పార్టీ ఆవిర్భవించిందని రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్పీ భంజ్ దేవ్, ఎమ్మెల్యే అభ్యర్థి సంధ్యారాణి అన్నారు. పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భంజ్ దేవ్ నివాసంలో పార్టీ బర్త్ డే కేక్ కట్ చేసి నాయకులు కార్యకర్తలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, మండల అధ్యక్షులు ఆముదాల పరమేష్, అర్బన్ బ్యాంక్ మాజీ అధ్యక్షులు కూనిశెట్టి భీమారావు, మాజీ కౌన్సిలర్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

యువగళం జెండా ఆవిష్కరణ

టిడిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎప్పుడైనా పార్టీ జెండా ఆవిష్కరణ చేస్తారు. కానీ టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు, అభ్యర్థి సంధ్యారాణి సరికొత్త సాంప్రదాయానికి తెరలేపారు. పార్టీ జెండా ఆవిష్కరించకుండానే యువగళం జెండాను ఎగురవేయించారు. అన్ని చోట్లా అదే జెండాను ఎగురవేయడం చర్చనీయాంశమైంది.

సాలూరు రూరల్ : మండలంలో మామిడిపల్లి, బాగువలస, తోణాం, పెదబోర బంద, శివరాంపురం, కురుకుట్టి, కందులపదం, కొత్తవలస, ఖరాసువలసలో టిడిపి 42వ ఆవిర్భావ దినోత్సవాలు ఘనంగా పార్టీ నాయకులు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు ఆముదాల పరమేష్, అరుకు పార్లమెంటరీ రైతు సంఘం అధ్యక్షులు భూష తవుడు, మహిళా అధికార ప్రతినిధి డొంక అన్నపూర్ణ, తాడుతూరు చిన్నబాబు, మద్దిల కృష్ణ, బుజ్జి, రామారావు, తిరుపతిరావు పాల్గొన్నారు

సీతానగరం : స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద టిడిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నాయకులు ఆ పార్టీ జెండా ఎగరవేశారు. ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్ష కార్యదర్శులు పి.సత్యనారాయణ, ఆర్.వేణుగోపాల్ నాయుడు మాట్లాడుతూ పేదల కోసం టిడిపి ఆవిర్భవించిందన్నారు. అనంతరం సీనియర్ పార్టీ కార్యకర్తలను సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సలహరి గోపాలరావు, కె.అరవింద్ కుమార్, బి.శ్రీనివాసరావుతో పాటు వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండల కేంద్రంలోని జామి వారి కాంప్లెక్స్‌లో టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో జామి సింహాచలం, కె.నాగభూషణం, కె.శంకర్రావు, కార్యకర్తల అభిమానులు పాల్గొన్నారు.

కురుపాం : ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న టిడిపి నాయకులు

పాలకొండలో అభివృద్ధి జాడేది?

- విద్య, వైద్య రంగాల్లో వెనుకబాటు
- పాలకులకు పట్టని సమస్యలు

ప్రజాశక్తి-పాలకొండ

పేరుకే నియోజకవర్గం... అభివృద్ధి శూన్యం... సమస్యల నిలయం... నియోజకవర్గంలో విద్య, వైద్యం సౌకర్యాలు అంతంతమాత్రమే. ఉపాధిలో పూర్తిగా వెనుకబాటు. పాలకులు మారినా పాలకొండ అభివృద్ధికి నోచని పరిస్థితి.

పాలకొండ నియోజకవర్గం అభివృద్ధికి ఆమడ దూరానుంది. ముఖ్యంగా పట్టణ పరిధిలో అభివృద్ధి శూన్యం. ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్నాయి. నియోజకవర్గం విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో పూర్తిగా వెనుకబడింది. గత పాలకులతో పాటు, ప్రస్తుత ప్రభుత్వం హయాంలో కూడా అభివృద్ధికి ఆమడదూరంగానేఉంది. విద్య, వైద్య రంగాలతో పాటు నియోజకవర్గంలో ఉపాధి కల్పనకు కనీసం ఒక్క పరిశ్రమ కూడా లేని దౌర్భాగ్యంలో పాలకొండ ఉంది. ఉన్నత విద్య అయిన పిజి, ఇంజినీరింగ్ కళాశాలలు కూడా లేని పరిస్థితి. ఉన్నత విద్యను అభ్యసించేందుకు విద్యార్థులు పక్క జిల్లాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కనీసం పాలిటెక్నిక్ కళాశాల కూడా లేని దౌర్భాగ్య పరిస్థితి. వైద్యరంగం పరిస్థితులు కూడా అలాగే ఉన్నాయి. పేరుకే వంద పడకల హాస్పిటల్ అని ఉంది కానీ, అత్యవసర కేసులను కనీసం చూడకుండా వెంటనే జిల్లా హాస్పిటల్‌కు రిఫర్ చేస్తున్నారన్న చెడ్డ పేరు మూట కట్టుకుంది. పాలకొండ పట్టణంలో ఉండాల్సిన

పాలకొండలోని ఓ వీధికి వెళ్లే రోడ్డు పరిస్థితి

సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సీతంపేటకు తరలించారు. అయితే అక్కడ కూడా ఈ ఆసుపత్రి ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. ఇక్కడ ఉన్న ఏరియా హాస్పిటల్‌లో పూర్తిస్థాయిలో వైద్యులు లేకపోవడంతో రోగులు పక్క జిల్లాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఉపాధి రంగానికి వస్తే.. కనీసం ఒక్క పరిశ్రమ కూడా లేకపోవడంతో నిరుద్యోగ యువత ఉపాధి కోసం వలస వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అదే విధంగా మినీ స్టేడియం నిర్మించి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకొస్తామని పాలకుల హామీ నేటికీ నెరవేరలేదు. ఇది ఎప్పుడు పూర్తవుతుందోనని ఎవరూ చెప్పలేరు. పర్యాటక రంగంలో పాలకొండ వెనుకబడి ఉంది. రాష్ట్రంలోనే అత్యధికంగా పన్నులు వసూలు చేస్తారనే పేరు ఉన్న పాలకొండ నగరపంచాయితీలో మౌలిక సదుపాయాలు మాత్రం ఆ స్థాయిలో ఉండవని ప్రజలు పెదవి విడుస్తున్నారు. రాష్ట్రంలోనే ప్రజల కోసం కనీసం ఒక పార్క్ కూడా లేని మునిసిపాలిటీగా పాలకొండ పేరు తెచ్చుకోవటం దారుణం. పట్టణంలో ఉన్న వెంకటరాయుని కోనేరును పార్క్‌గా తీర్చిదిద్దుతామని పాలకులు ప్రతిసారి ఇస్తున్న హామీ ఇక్కడ ప్రజలకు వినడం అలవాటైపోయింది. అదే వెంకటరాయుని కోనేరు విశ్రాంత ఉపాధ్యాయులు అయిన సాహిణి ప్రసాదరావు మాస్టర్ సహకారంతో అక్కడ ఒక గ్రంథాలయం, ఆలయం ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. కేవలం ఆయన వల్ల కోనేరుకు ఒకవైపు అయినా అభివృద్ధి జరిగిందని ప్రజలు చర్చించుకుంటున్నారు. అలాగే పట్టణంలో ప్రధాన రహదారిలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోతుంది. ప్రధాన రహదారిని 120 అడుగులకు విస్తరిస్తామని పాలకులు ఎప్పుటి నుంచో చెప్తున్నా ఇప్పటికీ కనీసం ఆచరణకు నోచుకోకపోవడం శోచనీయం. దీనివల్ల విపరీతంగా ట్రాఫిక్ పెరిగిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, రాజకీయ నాయకులు ఇచ్చిన హామీలను భవిష్యత్తులోనైనా ఆచరణలోకి తీసుకొ వస్తారని ప్రజలు ఆశిస్తున్నారు.

ఆశీలు వసూలుపై వాదులాడుకుంటున్న మున్సిపల్ అధికారులు, గ్రోమోర్ సిబ్బంది

ఆశీలు కట్టాల్సిందే..

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ పరిధిలోకి వాణిజ్యపరమైన సరుకులను తీసుకొచ్చే ఎలాంటి వాహనదారులైనా మున్సిపల్ కార్యాలయం ద్వారా నియమించబడే సిబ్బందికి ఆశీలు చెల్లించాల్సిందేనని మున్సిపల్ రెవెన్యూ విభాగం అధికారి రూబేను దిబ్బా అన్నారు. శుక్రవారం పట్టణ శివారులో మార్కెట్ యార్డ్ ఎదురుగా ఉన్న గ్రోమోర్ ఎరువుల దుకాణానికి 8 లారీలతో గ్రోమోర్ ఎరువులు రావడంతో ఆసీలు చెల్లించాలని మున్సిపల్ రెవిమ్యో విభాగం అధికారులు, సిబ్బంది డిమాండ్ చేయగా, సంబంధిత లారీ డ్రైవర్లు, గ్రోమోర్ ఎరువుల దుకాణం సిబ్బంది ఆశీలు చెల్లించమని మొండికేయడంతో గతంలో ఆశీలు వేలం పాట ప్రైవేటు వ్యక్తులు పాడి వసూలు చేసే వాళ్లని, వేలం పాట వాయిదా పడడంతో, మున్సిపల్ రెవెన్యూ విభాగం ఆధ్వర్యంలో ఆసీలు వసూలు చేయడం జరుగుతుందనిలారీ డ్రైవర్లకు చెప్పడంతో, ఇరువురి మధ్య కొంత వాగ్వివాదం జరిగింది. అనంతరం మున్సిపల్ రెవెన్యూ అధికారులు ఆసీలు చెల్లించినదే ఎరువులను దించడం జరగదని చెప్పడంతో గ్రోమోర్ ఎరువుల దుకాణం మేనేజర్ యాజమాన్యానికి సమాచారం తెలపడంతో, ఎట్టకేలకు ఆసీలు చెల్లింపులు జరిగాయి. ఆశీలు వసూళ్లలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పి. నారాయణరావు, జి.వినయ్ కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు చికిత్స చేస్తున్న వైద్యాధికారి లక్ష్మణరావు

రాయగడ జమ్ములో పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని రాయగడజమ్ములో శుక్రవారం నాబార్డ్ జీవ - జట్టు సంస్థ - పశు సంవర్ధక శాఖ సంయుక్తంగా పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్య అధికారి డాక్టర్ పి.లక్ష్మణరావు మాట్లాడుతూ ఎండలు ఉధృతంగా ఉన్నందున మూగజీవులైన పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్లను సురక్షితంగా చూసుకోవాల్సిన బాధ్యత పెంపకం దారులపై ఉందని, నీరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అన్నారు. స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వాలు పశుపక్షాదులకు సంరక్షణ విషయంలో అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, వ్యవసాయరంగ కార్యకలాపాలతో పాటు వ్యవసాయ అనుబంధ కార్యక్రమాలు నిర్వహించడం వల్ల మానవుల అభివృద్ధి కచ్చితంగా చెందడం జరుగుతుందని అన్నారు. పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యాధులు సోకిన పశువులకు టీకాలు వేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీవ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి.ప్రబోద్, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనులతో మాట్లాడుతున్న సిఐ బాలకృష్ణ

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలో ఏజెన్సీ ప్రాంతంలో గల పోలింగ్ కేంద్రాలు చిట్యాలబా, కన్నయ్యవలస, బొర్ర మామిడి, మిలియా కంచూరు పోలింగ్ కేంద్రాలను శుక్రవారం సాలూరు రూరల్ సిఐ జి.బాలకృష్ణ, స్థానిక ఎస్సై పి.నారాయణరావు సిబ్బంది సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో గిరిజనులకు ఎన్నికల నియమనిబంధనలు, మద్యం సైబర్ నేరాలు వాహనాల ప్రమాదాలపై అవగాహన కల్పించారు.

ఏనుగువాడ వీధుల్లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఏగులవాడలో పోలీస్ కవాతు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని ఏగులవాడలో ఎస్ఐ ఎస్. షణ్ముఖరావు ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కేంద్ర బలగాలతో పోలీసుశాఖ ఆధ్వర్యంలో కవాతు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బలగాలు, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని వెంకంపేట ఎస్సీ కాలనీలో ఉన్న బోరు పూడుకు పోవడంతో కొత్తగా బోరు అదే వీధిలో తీస్తున్నట్లు ఎంపిడిఒ అకిబ్ జావేద్ తెలిపారు. ఇప్పటికే క్రాష్ ప్రోగ్రాంలో బిసి కాలనీతో పాటు పలు చేతిపంపులకు మరమ్మతులు నిర్వహించగా, కాలనీవాసుల అభ్యర్థన మేరకు పంచాయతీ నిధులతో ఈ బోరును తీస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి తేళ్ల కృష్ణారావు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

బోరును తవ్విస్తున్న ఎంపిడిఒ జావేద్, సర్పంచి కృష్ణారావు

శ్రీనివాస దంపతులను సన్మానిస్తున్న ఎల్ఐసి ఉద్యోగులు

శ్రీనివాస సేవలు స్ఫూర్తిదాయకం

ఉద్యోగ విరమణ సన్మానసభలో వక్తలు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఎల్ఐసి యూనియన్ నాయకులు ఎం.శ్రీనివాస అందించిన సేవలు స్ఫూర్తి దాయకమైనవని ఎల్ఐసి ఉద్యోగ సంఘాల నాయకులు, పలు ప్రజాసంఘాల నాయకులు కొనియాడారు. ఎల్ఐసి విజయనగరం బ్రాంచిలో అసిస్టెంట్‌గా ఉద్యోగం చేసి ఉద్యోగ విరమణ చేసిన ఎం.శ్రీనివాస అభినందన సభ శుక్రవారం స్థానిక రెవెన్యూ హోంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆలిండియా ఇన్సూరెన్సు ఎంప్లాయీస్ అసోసియేషన్ జాతీయ మాజీకార్యదర్శి కె.వేణుగోపాల్, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓ వైపు ఉద్యోగం చేస్తూనే మరోవైపు ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకునేందుకు జరిగే ఉద్యమాల్లోను, కార్మిక పోరాటాల్లోనూ శ్రీనివాస తనవంతు కృషి చేశారని అన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా అదే స్ఫూర్తితో పనిచేయాలని ఆకాంక్షించారు. అనంతరం ఎల్ఐసి యూనియన్, ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ ఎల్ఐసి ఉద్యోగిగా, కార్మికసంఘం నాయకుడిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఉద్యోగంలో ఉన్నప్పుడు పీడిత, శ్రామిక వర్గ ప్రజలు కోసం ఆయన చేసిన సేవలను గుర్తు చేస్తూ ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. రిటైర్మెంట్ అనంతరం మరింత సమయం కేటాయించి పేద, బడుగు బలహీన వర్గాల కోసం పని చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎల్ఐసి ఉద్యోగుల సంఘం నాయకులు, ఏజెంట్ల సంఘం నాయకులు, అధికారులు, ప్రజాసంఘాలు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. అనంతరం శ్రీనివాస, శశికళ దంపతులను ఘనంగా సన్మానించారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో గల రావాడ రహదారి సమీపంలో ఉన్న గుడ్ సమారిటన్ లూథరన్ దేవాలయం, దొనకవీధిలో ఉన్న ఇమ్మానియేలు లూథరన్ దేవాలయంలో పాస్టర్ రెవరెండ్ పి.జీవన్‌కుమార్‌ప్రకాష్ ఆధ్వర్యంలో ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ ఏసుక్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటలకు సంబంధించి క్రైస్తవ సహోదరి, సహోదరులకు దైవ సందేశాన్ని వివరించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు డి.జాన్, డి.రాజారత్నం, కోట సుందర సుదర్శన్, డి.ప్రదీప్ కుమార్, జి.సుధా, డి.సుకన్య, రత్నమ్మ, కోట ఈశ్వరరావు, డి.జయ కుమార్ పాల్గొన్నారు.

సీతంపేట : గుడ్ ఫ్రైడే సంధర్భంగా సీతంపేట విచారణ పరిధిలోని విశ్వాసులు కంబగూడ లొయోలా సెంటర్ నుంచి గొయిది ఫాతిమామాత దేవాలయం వరకు శిలువమార్గం చేస్తూ పాదయాత్రగా వెళ్లారు. ఈ సందర్భంగా ఏసుక్రీస్తు సిలువ వేసే సమయంలో పడిన పాట్లును వివిధ వేషధారణలతో కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఫాదర్ విద్యాసాగర్, విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కురుపాం చర్చిలో ప్రార్ధనలు చేస్తున్న క్రైస్తవులు

గరుగుబిల్లిలో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

సీతానగరం మండలంలోని కాసాపేటలో గల చర్చిలో గ్రామ సేవకుల, క్రిస్టియన్లు అంతా కలిసి నిర్వహించిన ప్రార్థనా కార్యక్రమానికి వారి ఆహ్వానం మేరకు స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు పాల్గొని వారితో కలిసి ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, సేవకులు, సంఘ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: స్థానిక ఆర్‌సిఎం చర్చి ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన వీధిలో ప్రార్ధనలు చేసు కుంటూ ర్యాలీగా వెళ్లారు. అనంతరం రెవరెండ్ ఫాదర్ జ్ఞానప్రసాద్ గుడ్ ఫ్రైడే విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో గొర్రెల దాసు, దేవాతి అర్లప్ప, గొర్రెల దిలీప్, అరసాడ రాజు, గంట చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : స్థానిక తెలుగు బాప్టిస్ట్ చర్చి, ఆర్‌సిఎం చర్చిలతో పాటు తలవరం, తూడి, బిటి వాడ, వండువ, కత్తులకవిటి, హుస్సేన్‌పురం తదితర గ్రామాల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక తెలుగు బాప్టిస్ట్ దేవాలయం సంఘ కాపరి అభిషేక్ గుడ్‌ఫ్రైడే విశిష్టతను వివరించారు.

ఘటనా స్థలంలో షణ్ముఖరావు మృతదేహం

పెళ్లికార్డులు పంచుతూ వరుడు మృతి

ప్రజాశక్తి-రేగిడి

వివాహం చేసుకొని పిల్లాపాపలతో సుఖ జీవనం గడపాలని ఆశించిన ఆ పెళ్లి కుమారుడి ఆశలు ఆవిరయ్యాయి. ఏప్రిల్ 20న వివాహం చేసుకొనేందుకు ముహూర్తం ఖరారు చేశారు. పెళ్లి కార్డులు బంధువులకు పంచుతుండగా ఆటో రూపంలో మృత్యువు కాటేసింది. రేగిడి మండలం లచ్చారాయపురం వద్ద శుక్రవారం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొన్న సంఘటనలో పాతపట్నం మండలం కోయికొండ గ్రామానికి చెందిన యువకుడు షణ్ముఖరావు అక్కడికక్కడే మృతి చెందారు. అతని బంధువుకు తీవ్ర గాయాలయ్యాయి. ఏప్రిల్ 20న షణ్ముఖరావుకు టెక్కలికి చెందిన వధువుతో వివాహం కుదిరింది. ఈ వివాహానికి సంబంధించి కార్డులు పంచేందుకు ద్విచక్ర వాహనంపై షణ్ముఖరావు అతని బంధువు కలిసి బయలుదేరి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో పెళ్లి కార్డులు పంచుతూ లచ్చారాయపురం గ్రామం వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొని డ్రైవింగ్ చేస్తున్న షణ్ముఖరావు మృత్యువాత పడ్డాడు. అతని బంధువుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనతో కుటుంబంలో విషాదం అలముకుంది. పోస్టుమార్టం అనంతరం బంధువులకి మతదేహాన్ని అప్పగించారు. ఎస్ఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మిమ్స్ ఉద్యోగుల చర్చలు వాయిదా

ప్రజాశక్తి-నెల్లిమర్ల

తమ సమస్యలు పరిష్కరించాలని మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు స్థానిక ఆర్ఒబి వద్ద చేస్తున్న నిరసన పోరాటం శుక్రవారం 58వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా రెండు రోజులుగా జరుగుతున్న చర్చలు సోమవారానికి వాయిదా పడ్డాయి. ఈ సందర్భంగా మిమ్స్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టివి రమణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ శిబిరంలో మాట్లాడుతూ మిమ్స్ యాజమాన్యం 7 శాతం డిఎ ఇవ్వడానికి అంగీకారం తెలిపిందన్నారు. వేతన ఒప్పందం కొత్త నిబంధనల ప్రకారం చేస్తామని, అది కూడా ఏప్రిల్ నుంచి ఇస్తూ ఆగస్టులో ఒప్పందం చేస్తానని చెప్పడం భావ్యం కాదన్నారు. ముందు వేతన ఒప్పందం చేయాలని డిమాండ్‌చేశారు. కొత్త వేతన ఒప్పందం ప్రకారం పెరిగిన వేతనాలు ఆగస్టు నుంచి అమలు చేయాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఉద్యోగులు, కార్మికులకు పోరాట కాలంలో వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సస్పెండ్ చేసిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకునేందుకు యాజమాన్యం అంగీకరించిందని తెలిపారు. యూనియన్ ఆధ్వర్యంలో లేబర్ కమిషనర్ వద్ద అగ్రిమెంట్ చేయాలని ఉద్యోగులు, కార్మికులు కోరుతున్నారని తెలిపారు. శిబిరంలో మిమ్స్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.నారాయణ, ఉద్యోగులు కె.కాము నాయుడు, కె.మధు, ఎం.నాగభూషణం, గౌరీ, వరలక్ష్మి, బి.బంగారునాయుడు, మూర్తి, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పదవులకు కిమిడి రాజీనామా

ప్రజాశక్తి-చీపురుపల్లి

తనకు చీపురుపల్లి అసెంబ్లీ టిక్కెట్ కేటాయించ నందుకు నిరనసనగా టిడిపి విజయ నగరం పార్లమెంటు స్థానం అధ్యక్ష పదవికి, చీపురుపల్లి నియోజకవర్గ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు కిమిడి నాగార్జున ప్రకటించారు. శుక్రవారం తన నివాసంలో పార్టీ నాయకులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. పార్టీ అధిష్టానం విడుదల చేసిన అభ్యర్థుల ఆఖరి జాబితాలో తన పేరు లేకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్లుగా పార్టీ కోసం కార్యకర్తల కోసం నిరంతర శ్రామికుడిలా పని చేశానన్నారు. అయితే పార్టీ తనను కాదని వేరొకరికి పార్టీ టిక్కెట్ కేటాయిం చడం బాధాకరమైన విషమన్నారు. కష్టపడి పనిచేస్తే పార్టీ తనకు టిక్కెట్ ఇవ్వకుండా క్షవరం చేసిందన్నారు. తన భవిష్యత్తు కార్యాచరణను త్వరలోనే ప్రకటిస్తానని నాగార్జున తెలిపారు.

నాగార్జున వెంటే మేము కూడా

నాగార్జున బాటలోనే తాము కూడా నడుస్తామని టిడిపి చీపురుపల్లి మండల అధ్యక్షుడు రౌతు కాము నాయుడు, తెలుగు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పైల బలరాం తెలిపారు. వెన్నంటే ఉండి ఐదేళ్ల పాటు తమని నడిపించిన నాగార్జునకు టిడిపి రాష్ట్ర పార్టీ అన్యాయం చేయడం మంచి పద్ధతి కాదని అన్నారు.

ఎమ్మెల్యే కళావతికి స్వాగతం పలుకుతున్న సంతనర్సిపురం గ్రామస్తులు

సంత నర్సిపురంలో ఎమ్మెల్యే ప్రచారం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని సంతనర్సిపురంలో శుక్రవారం పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఎన్నికల ప్రచారం చేపట్టారు. గ్రామంలోని అన్ని వీధుల్లో పర్యటిస్తూ ప్రతి ఇంట్లో గల మహిళలను వృద్ధులను పలకరిస్తూ ఎమ్మెల్యే కళావతి వైసిపి శ్రేణులు నూతన ఉత్సాహాన్ని నింపారు. గత ఐదేళ్ల పాలనలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. సర్పంచి కర్రి సత్యవతమ్మ, పిఎసిఎస్ అధ్యక్షులు కర్రి గోవిందరావు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 20 కుటుంబాలు టిడిపి నుంచి వైసిపిలో చేరాయి. వీరికి ఎమ్మెల్యే కళావతి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మహదేవలసకు చేరుకుని ఎన్నికల ప్రచారం చేశారు. ప్రచారంలో ఎంపిపి డి.వెంకటరమణనాయుడు, జడ్పిటిసి జంపు కన్నతల్లి ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షులు పి.విజయకుమారి, ఎఎంసి వైస్ చైర్మన్ పొట్నూరు లక్ష్మణరావు, ఐపవర్ కమిటీ నాయకులు సత్యం నాయుడుతో పాటు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎమ్మెల్యే ప్రచారం

పార్వతీపురంరూరల్ : మండలంతో పాటు పట్టణంలో వైసిపి అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఎన్నికల ప్రచారం శుక్రవారం కొనసాగించారు. మండలంలోని వెంకంపేట మున్సిపాలిటీ పరిధిలోని 23, 24 వార్డుల్లో ఇంటింటికి వెళ్లి ఐదేళ్లుగా తాను చేసిన సేవలను వివరిస్తూ రాబోయే ఎన్నికల్లో తనకు ఓటు వేయాల్సిందిగా అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షులు బొమ్మి రమేష్, స్థానిక సర్పంచ్ తీళ్ల కృష్ణారావు, పిఎసిఎస్ చైర్మన్ తీళ్ల శివున్నాయుడు, వైస్ ఎంపిపి సిద్దా జగన్నాథ రావు, బంకురి రవికుమార్, ఎంపీపీ ప్రతినిధి మజ్జి శేఖర్, జడ్పిటిసి ప్రతినిధి బలగ నాగేశ్వరరావు, ఎంపిటిసి బడే రామారావు, జెసిఎస్ కన్వీనర్ బి.వాసుదేవరావు, నాయకులు మువ్వల సత్యంనాయుడు, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి వి.గురురాజు, తాన్న శ్రీరాములు, గణేష్, సాయి, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు సాంబమూర్తి

ఉపాధి బకాయిలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి - కొమరాడ

ఉపాధి పనులు చేసి ఆరు వారాలుగా పెండింగ్ ఉన్న కూలీలకు బిల్లులు వెంటనే చెల్లించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో కార్మికులకు, రైతులకు, వ్యవసాయ కూలీలకు అన్ని విధాలా అండగా ఉంటున్న వారి సమస్యలపై పోరాటం చేస్తున్న ఎర్ర జెండా నాయకత్వంలో ఎవరైతే ఎమ్మెల్యేగా, ఎంపీగా పోటీ చేస్తున్నారో వారికే మీ ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రచారం చేశారు. అనంతరం ఉపాధి పనులు చేసే కూలీలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. గడిచిన ఆరువారాలుగా ఎండనక, వాననక అనేక ఇబ్బందులు పడుతూ రెండు పూటలా ఉపాధి పని చేస్తున్న కూలీలకు పనిచేసిన 14 రోజులకే బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. నిబంధనలు ఉన్నప్పుడు గడిచిన ఆరు నెలలుగా ఉపాధి బిల్లులు చెల్లించకపోవడంతో పేదలు ఆర్థిక ఇబ్బందులతో ఇతర జిల్లాలకు ఇతర రాష్ట్రాలకు పెసర, మినప మొక్కల తీత, ఇతర పనులకు వలసలు వెళ్తుంటే ఇక్కడ జిల్లా స్థాయి అధికారులు పట్టించుకోకపోవడం చాలా అన్యాయమని తెలిపారు. ఉపాధి పనులు చేసే చోట టెంట్లు, మంచినీరు, మజ్జిగ, మెడికల్ కిట్లు గానీ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అయినా పనులు చేసినా నేటికీ వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి 8వారాల పెండింగ్ బిల్లులు చెల్లించేలా జిల్లాస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని, లేనిచో ఉపాధి హామీ కూలీలతో కలిసి ఏప్రిల్ మొదటి వారంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

పునరాలోచించకుంటే స్వతంత్రంగా పోటీ : బంగార్రాజు

భోగాపురం : టిక్కెట్ల కేటాయింపు విషయంలో పార్టీ పునరాలోచించుకొని రెండు మూడు రోజుల్లో న్యాయం చేయకపోతే ఇండిపెండెంట్ పోటీ చేస్తానని కర్రోతు బంగార్రాజు ప్రకటించారు. పార్టీ అధిష్టానం శుక్రవారం విడుదల చేసిన జాబితాలో ఆయనకు పార్టీ ఎక్కడా టికెట్ ఇవ్వకపోవడంతో పోలిపల్లిలోని ఆయన స్వగహంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కచ్చితంగా గెలిచి తీరుతామన్న టికెట్‌ను పొత్తుల్లో భాగంగా జనసేనకు కేటాయించారని, తర్వాత అధిష్టానం భీమిలి లేదా చీపురుపల్లిలో అవకాశం ఇస్తామని చెప్పి ఇవ్వలేదన్నారు.